

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఖానాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌తో మలేషియా బాధిత కుటుంబసభ్యులు

## మలేషియా నుంచి స్వదేశానికి..

**కేటీఆర్, జాన్సన్ చొరవతో ఇంటికి చేరిన కార్మికులు**

ఖానాపూర్, మే 21 : మలేషియా దేశంలో కొంతకాలంగా జైలులో మగ్గుతున్న కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆరుగురు కార్మికులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రత్యేక చొరవతో బుధవారం స్వదేశానికి చేరుకున్నారు. స్వదేశానికి తీసుకు రావడానికి కృషి చేసినందుకు బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్, జాన్సన్ నాయక్ లేకుంటే తమ జీవితాలు లేవని జీవితంతం రుణపడి ఉంటామని కంట తడి పెట్టి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నందినగర్‌లోని తన నివాసంలో కలిసినట్లు జాన్సన్ నాయక్ 'నమస్తే తెలంగాణ'కు ఫోన్‌లో తెలిపారు. స్వదేశానికి చేరుకున్న వారిలో నరేశ్, భాస్కర్, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్, రవీందర్ ఉన్నారు.



ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్నలు తడవకుండా కవర్లు కప్పుతున్న రైతులు



నిర్మల్ మండలం ముజ్గి గ్రామంలో వడ్ల కుప్పల్లోకి నీరు రాకుండా మట్టి కట్టలు కడుతున్న రైతు



ఆదిలాబాద్‌లో తడిసిన సంచులు



నిర్మల్ మండలం చిట్యాల్‌లో వర్షం కారణంగా తడిసిపోయిన ధాన్యం రాశులు

# రెక్కల కష్టం.. నీటిపాలు

## సర్కారు కొనుగోళ్లు ఆలస్యం కావడంతో తడిసిన ధాన్యం

### నిర్మల్ జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం

### తడిసిన వడ్లను ఆంక్షలు లేకుండా కొనాలని అన్నదాతల డిమాండ్

ఆదిలాబాద్/నిర్మల్, మే 21(నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించింది. అయినా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అల్పపీడనం కారణంగా బుధవారం తెల్లవారు జాము నుంచి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం కొంత తెరిపిచ్చిన వర్షం మళ్లీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. ముఖ్యంగా ఖానాపూర్, కడెం, లక్ష్మణచాంద, నిర్మల్, సోన్, సారంగాపూర్, కుంటాల, దిలావర్‌పూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలతోపాటు కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. నిర్మల్ మండలంలోని తాంశ, కౌట్ల (కే), ముజ్గి తదితర గ్రామాల్లో రోడ్ల పక్కన ఆరబోసిన వడ్లు పూర్తిగా తడిసిపోయి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఈసారి జిల్లాలో ఎక్కువగా ఐకేపీ మహిళా సంఘాలకు సెంటర్లను కేటాయించడం వల్లనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాల నిర్వహణలో అనుభవం లేకపోవడం, అవసరమైన మేరకు కూలీలను తెప్పించడంలో విఫలం కావడం వల్లనే కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్న వాదనలు ఉన్నాయి. కొన్ని చోట్ల రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు 15 నుంచి 20 రోజులుగా ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి తీవ్రంగా ఉన్నదో అర్థమవుతున్నది. కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యానికి తోడు అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో కోతలు, కొర్రీలతోపాటు సరైన వసతులు లేక, సమయానికి కాంటాలు పెట్టకపోవడంతో తాము నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూలీల సంఖ్యను పెంచి వేగంగా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని, అలాగే తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**తడిసిన జొన్నలు**

ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డుల్లో రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన జొన్నలు తడిసిపోయాయి. మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లలో జాప్యం ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు మంగళవారంతోపాటు బుధవారం ఉదయం రైతులు పంటను విక్రయించడానికి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ యార్డుల్లోని షెడ్లు జొన్నలతో నిండిపోగా.. కొందరు రైతులు షెడ్ల కింద ఖాళీ ప్రదేశాల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేశారు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి పంట కొంత తడిసింది. రైతులు కవర్లు కప్పి జొన్నలను తడవకుండా కాపాడుకున్నారు. వర్షం తగ్గిన వెంటనే పంటను కొనుగోలు చేయాలని రైతులు కొనుగోలు కేంద్రాల సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. మార్కెట్ యార్డుకు వాహనాల్లో తీసుకొచ్చిన జొన్నలు వర్షంతో అన్‌లోడ్ చేయలేదు. వర్షం కారణంగా పంటలో తేమ శాతం పెరుగుతుందని, దీంతో సిబ్బంది పంటను తీసుకునేందుకు సుముఖత చూపడం లేదని రైతులు అంటున్నారు. పంట కొనుగోళ్లలో జాప్యం కారణంగా తాము నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు.



బజార్‌హత్నూర్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు



ఆదిలాబాద్ పంటను కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని వేడుకుంటున్న రైతులు



ముజ్గి కొనుగోలు కేంద్రంలో భారీ వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న రైతులు



లక్ష్మణచాంద : ధర్మారం కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దయిన ధాన్యం బస్తాలు



లక్ష్మణచాంద : ధర్మారంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు దావ లక్ష్మి



ఖానాపూర్ రూరల్ : సత్తనపల్లి పీఏసీఎస్ కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

## రెడ్డి సంఘ భవనాన్ని ప్రారంభించిన రామన్న



పూజా కార్యక్రమాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 21 : ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డులో నూతనంగా ఏర్పాటు చేసుకున్న రెడ్డి సంఘ నూతన భవన ప్రారంభోత్సవం కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డి సంఘ సభ్యులు జోగు రామన్నని ఘనంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రామన్న మాట్లాడుతూ.. తన రాజకీయ ప్రస్థానంలో మొదటి గురువులు రెడ్డి బంధువులేనని గుర్తు చేశారు. వారు అందించిన ప్రోత్సాహంతో రాజకీయంగా అనేక పదవులను పొందానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి సంఘాలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించే సదుద్దేశంతో సంఘ భవనాలను ఏర్పాటు చేసే దిశగా ఆయా సంఘాల భవనాలకు స్థలాలను కేటాయించామన్నారు. సంఘ భవనాల ద్వారా ఆయా సంఘంలో ఆర్థిక వెసులుబాటు తోపాటు సంఘ సభ్యులకు మరిన్ని సేవలు అందించొచ్చని కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనంపై వెళ్లి పనులు పరిశీలించిన కలెక్టర్



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 21 : కూలీలకు గిట్టుబాటయ్యేలా ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాలబోరి, కచ్‌కంటి, యాపలగూడలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చిట్యాలబోరి అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న పనులను పరిశీలించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. కారు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో పనులను తనిఖీ చేసేందుకు బైక్‌పై వెళ్లి కూలీలతో మాట్లాడారు. కొలతలు ఇస్తున్నారా? లేదా? ఏ ప్రకారం పనులు చేస్తున్నారు? కూలీ ఎంత వస్తుంది? ఉదయం ఏ సమయంలో వస్తున్నారో? తదితర వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. కూలీలకు సరైన కొలతలను ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, పంచాయత్ రాజ్ ఈఈ శివరాం, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిన్న కేసులను త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఉట్నూర్, మే 21 : చిన్న చిన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం స్థానిక ఉట్నూర్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో పెండింగ్ కేసులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో వేగవంతం, సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కేసులు త్వరగా పూర్తి చేయడం ద్వారా నిందితులకు శిక్ష పడుతుందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మూడు సర్కిల్స్, ఎనిమిది స్టేషన్‌లో అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు 200 వరకు ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ మొగిళి, నార్నూర్ సీఐ రహీం, ఎస్ఐలు ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

- జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో
- మూడు వైపులా నిలిచిపోయిన వాహనాలు
- ఆర్డీవో రాకతో దీక్ష విరమణ

## తడిసిన ధాన్యాన్ని కొనాలి

కుంటాల, మే, 21 : కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో గల కొనుగోలు కేంద్రాల్లో తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిందని, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు కిరణ్ కొమ్రేవార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అర్లీ క్రాస్ రోడ్డు వద్ద పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కటింగ్ పేరిట ఎక్కువ ధాన్యం జోకుతుండడంతో రైతులు నష్టపోతున్నారని, రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. దీంతో మూడు వైపులా ట్రాఫిక్ జామ్ కావడంతో కూడలీ వద్ద గందరగోళం నెలకున్నది. కాసేపటి తర్వాత భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని హామీ ఇవ్వడంతో నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కుంటాల బీఆర్ఎస్ కన్వీనర్ దత్తు, బాసర మండల కన్వీనర్ శ్యామ్, నర్సాపూర్ కన్వీనర్ సుదాం, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దశరథ్, మాజీ ఎంపీపీ రాజేశ్వర్, రావుల పోశెట్టి, రజనీకాంత్, వంశీ పాల్గొన్నారు.



కుంటాలలోని కొనుగోలు కేంద్రంలో కుప్పలో చేరిన వర్షపు నీరును ఎత్తిపోస్తున్న రైతులు